ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.0
కనిష్ఠం 21.0
***

ANDHRAJYOTHY

నల్లగొండ

5

బుధవారం 17 జూలై 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	503.00 (120.0900)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.60 (2.69)	416.43	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	99.27 (0.70)	నిల్	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.124 | డ్రెస్ : రూ.180 | స్కిన్‌లెస్ : రూ.206

త్యాగానికి ప్రతీక మొహర్రం

నేడు మాతం ప్రదర్శనకు ఏర్పాట్లు



నల్లగొండ కల్చరల్, జూలై 16: కర్బలా మైదానంలో జరిగిన యుద్ధంలో మహ్మద్ ప్రవక్త మనుమడు ఇమాం హుస్సేన్ బలిదానాన్ని స్మరిస్తూ ముస్లింలలోని ఓ వర్గం ఏటా మొహర్రం వేడుకలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకా రం మొదటి మాసాన్ని మొహర్రంగా పిలవడంతోపా టు పది రోజుల పాటు పవిత్ర దినాలుగా భావిస్తారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకల్లో హిందువులు సైతం పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. ఈనెల 10వ తేదీన మొదలైన మొహర్రం వేడుక లు తొమ్మిది రోజులు పల్లె, పట్టణాల్లో పీర్లను ఊరేగించి పీర్ల కొట్టానికి చేర్చారు. రాత్రి వేళ పీర్ల కొట్టం ఎదుట అగ్నిగుండం ఏర్పాటు చేసి అలావ్ ఆడారు. పదో రోజున బుధవారం ఆషురా నిర్వహిస్తారు. ఈ రోజున బెల్లం పానకం తయారు చేసి పంపిణీ చేస్తారు. పీర్లను తిరిగి ఊరేగించి చెరువుల్లో నిమజ్జనం చేస్తారు. కులమతాలకతీతంగా పలువురు దట్టీలు సమర్పించి మొక్కు చెల్లించుకునేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లా కేంద్రంలోని జామా మసీదు సమీపంలోని పీర్ల కొట్టంలో ఫాతిమా, బడేనాన్‌సాబ్, చోటే నాన్‌సాబ్ సవార్లను ఏర్పాటుచేశారు. పీర్లను పానగల్ ఉదయసముద్రం చెరువులో నిమజ్జనం చేయనున్నారు. మొహర్రం సందర్భంగా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు తొలి ఏకాదశి

వేడుకలకు ముస్తాబైన ఆలయాలు

నల్లగొండ కల్చరల్, జూలై 16: హిందువుల క్యాలెండర్ ప్రకారం ఆషాఢ మాసం బుధవారం తొలి ఏకాదశి పండుగ జరగనుంది. తొలి ఏకాదశి వేడుకలు అన్నీ శైవ, వైష్ణవ ఆలయాలు ముస్తాబయ్యాయి. భక్తులు ఈ రోజున ఉపవాస దీక్ష పాటించి మరుసటి రోజున విరమిస్తారు. ద్వాదశి తిథి ముగిసే లోపు ఏకాదశి రథాన్ని పూర్తి చేస్తారు. ఏకాదశి తిథికి ప్రత్యేక ప్రాముఖ్యం ఉంది. ప్రతీ నెల రెండుసార్లు ఏకాదశి తిథి వస్తుంది. ఈ రోజున మహా విష్ణువును భక్తి శ్రద్ధలతో పూజించడం ఆనవాయితీ. మహా విష్ణువు తొలి ఏకాదశి రోజున క్షీరసాగరంలో యోగ ముద్రకు చేరుకుంటారని భక్తుల నమ్మకం. ఆ రోజు నుంచి చాతుర్మాసం ప్రారంభమవుతుంది. పట్టణంలో పలు ఆలయాల్లో తొలిఏకాదశి వేడుకలకు ఏర్పాట్లను పూర్తిచేశారు. భక్తులు తెల్లవారుజాము నుంచే సమీపంలోని ఆలయాలకు చేరుకొని ఇష్టదైవాన్ని దర్శించుకొని పూజల్లో పాల్గొంటారు. ఉపవాస దీక్షలో ఉన్న భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ దైవ స్మరణలో నిమగ్నమవుతారు.



పంచాయతీల్లో సిబ్బంది కుదింపు?



గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బంది కుదింపుపై జిల్లా పంచాయతీ అధికారులు దృష్టిపెట్టారు. 2019లో తీసుకువచ్చిన జీవో 51లోని మార్గదర్శకాల ప్రకారం అదనపు సిబ్బందిని తొలగించే ఆలోచనలో అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది. జిల్లా పంచాయతీ అధికారి ఇచ్చిన మౌఖిక ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం పనిచేస్తున్న అన్ని కేటగిరీల సిబ్బంది జాబితాను పరిశీలించే పనిలో పంచాయతీ కార్యదర్శులున్నారు. దీంతో కొన్నేళ్లుగా రాజకీయ నాయకుల అండదండలతో పంచాయతీల్లో దినసరి కూలి కింద పని చేస్తున్న వారికి ఉద్యోగం ప్రమాదంలో పడింది. ఎప్పటికైనా తమను ఎంపీడబ్ల్యూఎస్ (మల్టీపర్పస్ వర్కర్ స్కీం)కింద గుర్తించే అవకాశం ఉంటుందన్న ధీమాతో పనిచేస్తున్న వారికి చుక్కెదురైనట్టే.

\- నార్కట్‌పల్లి


- జనాభా ప్రాతిపదికన సంఖ్య
- జీవో 51 మేరకే ఉండేలా చర్యలు
- 2011 జనాభా ప్రకారం ఎంపీడబ్ల్యూల కేటాయింపు
- ప్రస్తుత జనాభా ప్రకారం పెరగని వారి సంఖ్య
- కుదింపు సరికాదంటున్న జీపీ కార్మిక సంఘం

సర్పంచ్‌ల అధికార జోక్యంతో కొన్ని గ్రామ పంచాయతీల్లో ఇష్టానుసారంగా సిబ్బందిని నియమించి వేతనాలు చెల్లించలేక అవస్థలు పడిన సందర్భంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మల్టీ పర్పస్ వర్కర్స్ (ఎంపీడబ్ల్యూఎస్) విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ మేరకు కొన్ని మార్గదర్శకాలను 2019లో జీవో నెంబర్ 51 ద్వారా జారీ చేసింది. ఈ జీవో మేరకు ప్రతీ గ్రామ పంచాయతీకి ఇద్దరు ఎంపీడబ్ల్యూలు ఉండేలా చర్యలు తీసుకుంది. అయితే ఎక్కువ జనాభా ఉండే గ్రామ పంచాయతీల్లో 500 జనాభాకు ఒకరు చొప్పున ఒక మల్టీపర్పస్ వర్కర్‌ను అదనంగా నియమించాలని సూచించింది. దీనికి 2011 నాటి జనాభా లెక్కలను ప్రాతిపదికగా చేసుకుని ఏ పంచాయతీకి ఎంత మంది సిబ్బందిని మల్టీ పర్పస్ వర్కర్లుగా గుర్తించాలో నిర్ణయించింది. ఆ ప్రకారం నార్కట్‌పల్లి మేజర్ గ్రామ పంచాయతీలో 8,900మంది జనాభాకు 18 మందిని మాత్రమే మల్టీ పర్పస్ వర్కర్లు ఉండేలా కేడర్ స్ట్రెంత్‌ను కేటాయించింది. ఈ 18 మందికి ప్రభుత్వం వేతనాలు చెల్లించాల్సి ఉంది. మిగతా అదనపు సిబ్బందికి రోజువారీ వేతనం కింద చెల్లిస్తున్నారు.

అడ్డగోలుగా తొలగిస్తే ఉద్యమిస్తాం

జీవో నెంబర్ 51ని అడ్డుపెట్టుకుని గ్రామ పంచాయతీల్లో అదనం పేరుతో సిబ్బందిని తొలగించి ఎంపీడబ్ల్యూలకు పనిభారం పెంచితే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం. కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న పంచాయతీ వర్కర్ల వేతనాల సర్దుబాటుకు జిల్లా పంచాయతీ అధికారులు వేసిన ఎత్తుగడ ఇది. పెరుగుతున్న గ్రామాల అవసరాల మేరకే సర్పంచ్‌లు అదనపు సిబ్బందిని దినసరి కూలీలుగా తీసుకున్నారు. వారి చేత ఇన్నాళ్లూ వెట్టిచేయించి జీవో నెంబర్ 51 సాకుతో ఏరివేసేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని అడ్డుకుంటాం. 500 జనాభాకు ఒక సిబ్బంది చొప్పున మించి ఉండొద్దనే ఆదేశాలతో తీసేస్తామంటూ కొన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు దినసరి కూలీలను భయపెడుతున్నారు. పనిభారం పెంచి వెట్టిచాకిరీ చేయించే విధానాన్ని తిప్పికొడతాం.

\- చినపాక లక్ష్మీనారాయణ, జీపీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి



అప్పట్లోనే వ్యతిరేకించిన కార్మిక సంఘాలు

గ్రామ పంచాయతీల్లో ఎంపీడబ్ల్యూ విధానాన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకించాయి. ఇది లోపభూయిష్టమైన నిర్ణయమని వాదించాయి. మల్టీపర్పస్ వర్కర్ విధానం కింద ఓ చిన్న గ్రామ పంచాయతీలో బిల్ కలెక్టర్ విధులు నిర్వర్తించే వ్యక్తి ఎంపీడబ్ల్యూ విధానం ప్రకారం మురుగు కాల్వలు కూడా శుభ్రం చేయాల్సి ఉంటుంది. నైపుణ్యం లేకపోయినా విద్యుత్ స్తంభం ఎక్కి వీధిలైట్లు ఏర్పాటుచేయాల్సి రావడం, డ్రైవింగ్ రాకున్నా గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను నడపడం వంటివి విధులుగా నిర్వహించడం అశాస్త్రీయమని కార్మిక సంఘాలు అభ్యంతరం చెప్పాయి. అవసరాలు, అర్హత మేరకే పంచాయతీ సిబ్బందిని కేటాయించాలని, ఎలక్ట్రీషియన్ విధులు చేసే వ్యక్తితో మురుగు కాల్వలు శుభ్రం చేయించడం సరికాదని వాదించాయి. 2021లో జనాభా లెక్కలు నిర్వహించాల్సి ఉండగా, కేంద్ర ప్రభుత్వం పలు కారణాలతో వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో పంచాయతీల్లో జనాభా పెరిగినా సిబ్బంది సంఖ్యకు మాత్రం 2011 నాటి జనాభాతో ముడిపెట్టడం సరికాదని పంచాయతీ కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి.

పెరిగిన పనిభారం



ప్రభుత్వం ప్రతీ కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీకే ముడిపెట్టి నిర్వహిస్తోందన్న వాదన ఉంది. ఇంటి పన్నులు, నల్లా బిల్లుల వసూలు, ఇతర గ్రామ పంచాయేతర ప్రభుత్వ పథకాల అమలు పనులూ పంచాయతీ సిబ్బందికే ప్రభుత్వంతోపాటు, అధికారులు అప్పగిస్తున్నారు. కొన్నాళ్ల క్రితం ఉపాధి హామీ పథకం పనులను కూడా గ్రామ పంచాయతీ కార్యదర్శులే పర్యవేక్షించారు. అసలే గ్రామాల విస్తీర్ణం పెరిగి ఉన్న పనికే పారిశుధ్య సిబ్బంది సంఖ్య సరిపోదనుకుంటే అదనంగా ప్రభుత్వ పాఠశాలలను ఊడ్చటం, టాయ్‌లెట్ బ్లాక్‌లను శుభ్రం చేయడం వంటివాటితో పనిభారం పెరిగిందని పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్పంచ్‌ల ఇష్టంతో

జీవో నెంబర్ 51 మార్గదర్శకాలు ఎలా ఉన్నా, చాలా గ్రామ పంచాయతీల్లో అవసరాల మేరకు అదనపు సిబ్బందిని సర్పంచ్‌లు వారికున్న అధికారంతో దినసరి వేతనాల కింద నియమించుకున్నారు. ఎంపీడబ్ల్యూ కింద గుర్తించిన వారికి ప్రభుత్వం రూ.9,500 వేతనంగా చెల్లిస్తుండగా, మరో రూ.5,000 గ్రామ పంచాయతీ నిధుల నుంచి కలిపి మొత్తం రూ.14,500 వారికి చెల్లిస్తున్నారు. అవసరమైనప్పుడు రోజువారీ లెక్కన దినసరి వేతనం కింద పనిచేస్తున్న అదనపు సిబ్బందికి మాత్రం రోజుకు రూ.350 చొప్పున పంచాయతీలు చెల్లిస్తున్నాయి. అయితే అప్పట్లో కొందరు సర్పంచ్‌లు వారి రాజకీయ ప్రయోజనాల కోసం నియమించిన అదనపు సిబ్బందితో గ్రామ పంచాయతీలకు ఆర్థిక భారమవుతుందనే కారణంతో జీవో 51ని సమర్థంగా అమలుచేసేలా అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఎంపీడబ్ల్యూ కింద గుర్తించిన ఉద్యోగులు మినహా మిగతా దినసరి కూలీలను ఏరివేసే ప్రక్రియకు సన్నాహాలు చేస్తున్నట్లు గ్రామ పంచాయతీ వర్కర్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేస్తోంది.

ఆదర్శ పాఠశాల భవనంలోకి కేజీబీవీ వద్దు

- వేములపల్లి ఆదర్శ పాఠశాల బాలికల ఆందోళన
- జిల్లాలో 27కి భవనాల్లేని కేజీబీవీలు మూడే
- ఆదర్శ పాఠశాలలన్నింటికీ అందుబాటులో సొంతభవనాలు, హాస్టళ్లు



వేములపల్లిలోని ఆదర్శ పాఠశాల హాస్టల్‌లోని గేటు వద్ద రెండో రోజు నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు

నల్లగొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): వేములపల్లి మండల కేంద్రంలో ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న తరగతిగదుల భవనాలు, హాస్టల్ భవనాల్లోకి కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని తరలించాలనే నిర్ణయాన్ని ఆదర్శ పాఠశాల బాలికలు వ్యతిరేకిస్తున్నారు. కేజీబీవీని ఆదర్శ పాఠశాలలోకి తరలించవద్దని డిమాండ్ చేస్తూ సోమ, మంగళవారాలు రెండు రోజుల పాటు ఆదర్శ పాఠశాల బాలికలు తరగతులు బహిష్కరించి ఆందోళన కొనసాగించారు. పాఠశాల ఆవరణలో ధర్నా చేశారు. వేములపల్లికి మంజూరైన కేజీబీవీని గతంలోనే భవన సదుపాయాలు లేకపోవడంతో తిప్పర్తిలోని ఎస్ఎల్‌బీసీ భవనాల్లో తిప్పర్తి కేజీబీవీతో కలిపి నిర్వహిస్తున్నారు. అయితే అక్కడ భవనాలు శిథిలం కావడం, బాలికలకు ఇబ్బందిగా ఉండడంతో తాజాగా వేములపల్లి కేజీబీవీని వేములపల్లిలోని ఆదర్శ పాఠశాలలో ఉన్న ఖాళీ భవనాల్లోకి మార్చాలని జిల్లా విద్యాశాఖాధికారి, కేజీబీవీల పర్యవేక్షకులు నిర్ణయించారు. ఈ మోడల్ స్కూల్‌లో ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు నడుస్తుండగా 90మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 70మందికి హాస్టల్ అడ్మిషన్లు ఉండగా, హాస్టల్‌లో కేవలం 40నుంచి 50మంది వరకే ఉంటున్నారు. దీంతో ఇక్కడున్న 25 హాస్టల్ గదుల్లో ఈ విద్యార్థులపోను, మిగిలిన గదులను కేజీబీవీకి కేటాయించాలని నిర్ణయించారు.

కేజీబీవీలోనూ ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు కొనసాగుతుండగా, 260మంది విద్యార్థులు ఉన్నారు. కేజీబీవీని ఇక్కడకు తరలిస్తే హాస్టల్ గదులు సరిపోవని, తమకు నీళ్లు, మరుగుదొడ్లకు కూడా ఇబ్బంది కలుగుతుందని ఆదర్శ పాఠశాల విద్యార్థినులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆందోళన కొనసాగిస్తున్నారు. వరుసగా రెండు రోజులుగా ఈ ఆందోళన కొనసాగుతుండడంతో కేజీబీవీ తరలింపుపై ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే అంశంపై డీఈవో భిక్షపతిని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా, ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

27 కేజీబీవీలకు గాను మూడుచోట్ల భవనాల కొరత

జిల్లాలో మొత్తం 27 కేజీబీవీలు ఉండగా కొత్తగా ఏర్పాటైన తిరుమలగిరి (సాగర్), నేరేడుగొమ్ము, వేములపల్లి, కొండమల్లేపల్లిల్లోనే సొంత భవనాలు లేవు. వీటిల్లో నేరేడుగొమ్ము భవనం ఇటీవలే పూర్తవగా, తాజాగా మంగళవారమే ఆ భవనాన్ని ప్రారంభించారు. త్వరలో అక్కడకు పాఠశాలను తరలిస్తామని అధికారులు పేర్కొన్నారు. తిరుమలగిరి(సాగర్), కొండమల్లేపల్లి కేజీబీవీలను అద్దెభవనాల్లో కొనసాగిస్తుండగా, తిప్పర్తి కేజీబీవీతో కలిపి నడుపుతున్నందున వేములపల్లి కేజీబీవీని ఆదర్శ పాఠశాలలోకి తరలించాలనే నిర్ణయంపై ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఆందోళనకు దిగడం గమనార్హం. జిల్లాలో 17 ఆదర్శ పాఠశాలలుండగా, వీటన్నింటికీ తరగతి గదులతో పాటు, హాస్టల్‌భవనాలు, క్రీడామైదానాలు సంపూర్ణంగా అందుబాటులో ఉన్నాయని, ఎక్కడా ఎలాంటి సమస్య లేదని జిల్లా విద్యాధికారి పేర్కొన్నారు.

దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

నేరేడుగొమ్ములో కస్తూర్బా పాఠశాల భవనాన్ని ప్రారంభించిన ఎంపీ రఘువీర్‌రెడ్డి



దేవరకొండలో మొక్క నాటి నీరు పోస్తున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట, జూలై 16 : దేవరకొండ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నేరేడుగొమ్ము మండలకేంద్రంలో రూ.3.50కోట్లతో నిర్మించిన కస్తూర్బా పాఠశాల భవనాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఎంపీ ఎన్నికల్లో దేవరకొండ ప్రజలు అత్యధిక మెజార్టీ ఇచ్చినందుకు నియోజకవర్గానికి రుణపడి ఉంటానన్నారు. ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లోకసాని కృష్ణ, మాజీ ఎంపీపీ బిక్కునాయక్, తహసీల్దార్ శ్రీనివాస్, పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి

దేవరకొండ: వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై ఇంటింటా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకొండ బాలుర జూనియర్ కళాశాలలో మునిసిపల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హరిత వనమహోత్సవంలో ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి మొక్కలునాటి నీరుపోసి మాట్లాడారు. చెట్లను పెంచడంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని అన్నారు. ప్రజలను భాగస్వామ్యం చేయడం కోసమే ప్రభుత్వం వనమహోత్సవం చేపట్టిందని, హరితవనాలు పెంచాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మాట్లాడుతూ, దేవరకొండ నియోజకవర్గంలో వన మహోత్సవంలో లక్ష మొక్కలు నాటడమే లక్ష్యమన్నారు. అనంతరం పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవరకొండ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వైస్‌చైర్మన్ రహత్‌అలీ, మునిసిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ మల్లయ్య, ఏఈ రాజు, కౌన్సిలర్లు భూదేవి సైదులు, జయప్రకాష్‌నారాయణ, మల్లేశ్వరి శ్రీశైలం, హనుమంతు వెంకటేష్‌గౌడ్, లోకసాని శ్రీధర్‌రెడ్డి, పున్న వెంకటేశ్వర్లు, మారేపాకల సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో శారీరక పటుత్వం తగ్గుతోంది



పౌష్టికాహార లోపం, తల్లిదండ్రుల అవగాహనా రాహిత్యం, పేదరికం తదితర కారణాలు పసిపిల్లల ఆరోగ్యంపై పెను ప్రభావం చూపుతున్నాయి. 0-5 సంవత్సరాలలోపు వయసు ఉన్న పిల్లలో చాలా మందికి వయసుకు తగ్గట్టు ఎత్తు, బరువు లేకపోవడం, మరికొద్దిమందికి వయసు కు తగిన ఎత్తు లేనట్టు ఇటీవలి ఎన్‌హెచ్‌టీఎస్ (నేషనల్ హౌస్ హోల్డ్ ట్రావెల్ సర్వే) పేర్కొంది. దీంతో ఆ పిల్లల భవిష్యత్తు ఆరోగ్యం ఆందోళన కలిగిస్తుండగా, ఇప్పటికైనా పౌష్టికాహా రం అందిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటే వారి ఆరో గ్యం మెరుగు పడుతుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

\- భువనగిరి టౌన్

వయసుకు తగిన ఎత్తు, బరువు లోపించడానికి ప్రధాన కారణం పౌష్టికాహార లోపమైతే వంశపారంపర్యంగా వచ్చే కొన్ని లక్షణాలు కూడా పిల్లల శారీరక రుగ్మతలపై ప్రభావం చూపుతాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. అయితే రోజువారీగా కోడిగుడ్డు, పాలు,పండ్లు, పప్పుదినుసులు తదితర సమతుల ఆహారాన్ని క్రమం తప్పకుండా అందిస్తూ కొద్ది సేపు శారీరక వ్యాయామం అంటే క్రీడలు లేదా నడక, పరుగెత్తించడం చేస్తే మేలు జరుగుతుందని అంటున్నారు. కాగా, ఈ తరహా పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక కేటగిరీగా గుర్తించి అదనపు పౌష్టికాహారం ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అవసరమైన పిల్లలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య చికిత్సలు, మందులు అందించనున్నారు. అప్పటికీ శారీరక పురోగతి సాధించని పిల్లలను నల్లగొండ జిల్లా కేంద్రంలోని న్యూట్రిషన్ రీహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించి ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. పిల్లలతోపాటు వెంట ఉండే ఒకరికి భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. అలాగే పిల్లల వెంట వచ్చే తల్లి లేదా తండ్రి పనిదినం నష్టపోకుండా రోజుకు రూ.150 చెల్లిస్తారు. ఈ మొత్తాన్ని త్వరలో రూ.300కు పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు సమాచారం.

యాదాద్రి జిల్లాలో ఇలా

యాదాద్రి జిల్లాలో స్త్రీ, శిశు సంక్షేమశాఖలోని నాలుగు ప్రాజెక్టుల పరిధిలో 902 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన, కేంద్రాలకు వెళ్లని 0-5 ఏళ్ల వయసు పిల్లలు 40,036 మంది ఉన్నారు. వీరిలో 642 మంది (2శాతం) వయసుకు తగిన బరువు లేనట్టుగా, 499 మంది (1.5శాతం) ఎత్తుకు తగిన బరువు లేనట్టుగా సర్వేలో తేలింది. 3,860 మంది (12.5శాతం) వయసుకు తగిన పెరుగుదల లేదని గణాంకాలు చెబుతున్నాయి.

ఆ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతాం



వయసుకు తగిన ఎత్తు, బరువు లేని పిల్లలపై అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపుతాం. ఆ పిల్లలకు రోజువారీ పౌష్టికాహారంతో పాటు అదనపు ఆహారాన్ని కూడా అందిస్తాం. అవసరమైతే వైద్య చికిత్సలకు సిఫారసు చేస్తాం. క్రమం తప్పకుండా వివరాలు నమోదు చేస్తూ శారీరక పెరుగుదలను అంచనా వేస్తూ ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం. మెరుగైన పెరుదల కోసం నల్లగొండ జిల్లా కేంద్రంలోని న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో చేరుస్తాం.

\- కృష్ణవేణి, స్త్రీశిశు సంక్షేమశాఖ యాదాద్రి జిల్లా అధికారి

ఉమ్మడి జిల్లాలో హెన్‌హెచ్‌టీఎస్ సర్వే

ప్రజల సమగ్ర ఆరోగ్య వివరాల సేకరణే లక్ష్యంగా కేం ద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏడాది మార్చి నుంచి జూలై వరకు ఉమ్మడి జిల్లాలో అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ కుటుంబ ఆరోగ్య సర్వే నిర్వహించారు. హెన్‌హెచ్‌టీఎస్ సర్వేలో ప్రధానంగా 0-5 సంవత్సరాల వయసు ఉన్న పిల్లల వివరాలు సేకరించారు. యాదాద్రి జిల్లాలో 0-5 ఏళ్ల వయసు ఉన్న పిల్లలు 40,036 మంది ఉన్నట్టు తేలింది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు, రాని పిల్లల ఎత్తు, బరువు తదితర వివరాలను సర్వే సిబ్బంది నమోదు చేశారు. అయితే సుమారు 15శాతం పిల్లలు వయసుకు తగిన బరువు, ఎత్తు లేనట్టు, వయసుకు తగిన పెరుగుదల (ఎత్తు) లేనట్టు తేలింది. వీరిలో జిల్లాలోని 902 అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే పిల్లలే సుమారు 25వేల మంది వరకు ఉన్నట్టు తేలింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు రోజువారీగా సమతుల ఆహారం అందిస్తున్నా, పౌష్టికాహార లోపంతో శారీరక రుగ్మతలు వెలుగు చూస్తుండటంతో తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. పిల్లలు రక్తహీనత, వ్యాధినిరోధక శక్తి లోపాన్ని ఎదుర్కొనే అవకాశం ఉంది.



హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో సమీక్షా సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నల్లగొండ టౌన్, జూలై 16: తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు షేక్ ముస్తఫా డిమాండ్ చేశారు. మంగళవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలుచేయాలన్నారు. ఉద్యమకారులపై ఉన్న పోలీసు కేసులు ఎత్తివేయాలని, సమరయోధుల విస్తృత కమిటీని అధికారికంగా వెంటనే ప్రకటించి తొలి, మలిదశ ఉద్యమకారులకు గుర్తింపు పత్రాలు ఇవ్వాలన్నారు. 250 గజాల ఇంటి స్థలం, పింఛన్ పథకం కింద నెలకు రూ.25వేలు ఇవ్వాలన్నారు. హక్కుల సాధన కోసం త్వరలో మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి ఉద్యమకారులను గుర్తిస్తామన్నారు.

నిషేధిత గుట్కాల పట్టివేత

మఠంపల్లి, జూలై 16 : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామంలో నిషేధిత గుట్కాలను స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు మంగళవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు చౌటపల్లిలో దాడులు నిర్వహించి గుట్కాలు విక్రయిస్తున్న పిండ్రాంతి నాగేశ్వరరావు, శ్రీరంగం దుర్గారావుల నుంచి రూ.6 వేల విలువైన గుట్కాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హుజూర్‌నగర్‌లో

హుజూర్‌నగర్ : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో రూ.3 వేల విలువచేసే గుట్కా, పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు. పాతబస్టాండ్ ఎదుట ఉన్న నల్లగొండ పాన్ షాప్ యాజమాని పట్టణానికి చెందిన అఖిల్ అనే వ్యక్తి నుంచి తక్కువ ధరకు గుట్కా ప్యాకెట్లను కొనుగోలు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పాన్ షాప్ పక్క దుకాణాల్లో నిల్వ చేసి అవసరమైన వారికి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు స్థానికుల సమాచారంతో దాడి చేసి పక్క దుకాణాల్లో నిల్వ చేసిన గుట్కా, పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నల్లగొండ పాన్‌షాప్ యజమానిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. దాడులలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

హుజూర్‌నగర్, జూలై 16 : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని వేములూరు వాగు నుంచి హుజూర్‌నగర్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు. మంగళవారం ఉదయం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా లింగగిరి ప్రాంతంలోని వేములూరు వాగు నుంచి రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా పోలీసుసిబ్బంది పట్టుకున్నారు. ఇసుక సరఫరా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లు మచ్చ రవి, మీసాల మట్టయ్యలపై కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నామన్నారు.

తాళం వేసిన ఒకే వీధిలోని మూడు ఇళ్లలో చోరీ

యాదగిరిగుట్ట రూరల్, జూలై 16 : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని అంగడీబజార్‌లోని మూడిళ్లలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని గుర్తు తెలియని వ్యక్తి అర్ధరాత్రి రెండు గంటల సమయంలో చోరీకి పాల్పడ్డాడు. ఈ దృశ్యాలు ఆ కాలనీలోని సీసీ కెమెరాలో నమోదయ్యాయి. మూడిళ్లలో కలిపి 70 గ్రాముల బంగారం ఆభరణాలు, 30 గ్రాముల వెండి, రూ.93వేల నగదు చోరీకి గురయ్యాయి. మొత్తం విలువ రూ.6.20 లక్షల వరకు ఉంటుందని బాధితులు మంగళవారం తెలిపారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంగడిబజార్‌కు చెందిన భూపతి రవీందర్ ఇంట్లో రూ.3 వేల నగదు 10గ్రాముల బంగారుఆభరణాలు, 30 గ్రాముల వెండి, అదేవిధంగా రాగీర్ రాజు ఇంట్లో 40 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు, బాలకృష్ణ ఇంట్లో 20 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.40వేల నగదు చోరీ చేసినట్లు తెలిపారు. తామందరం ఇంటికి తాళం వేసి వేరే ఊరికి వెళ్లివచ్చినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

పోలీసులపై దాడిచేసిన నిందితుల రిమాండ్



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

వలిగొండ, జూలై 16 : గస్తీ నిర్వహిస్తున్న పోలీసులపై దురుసుగా ప్రవర్తించి, దాడి చేసిన నిందితులను మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. మండలంలోని అర్రూరుకు చెందిన కొప్పుల మత్స్యగిరి, కళ్లెం వీరస్వామి, ఎండీ నబీల్, జంగారెడ్డిపల్లికి చెందిన వీర్లపల్లి శేఖర్, నార్కట్‌పల్లి నవీన్‌లు అర్రూరు గ్రామఆర్చ్ సమీపం వద్ద మూడు ద్విచక్ర వాహనాలను రోడ్డుకు అడ్డంగా పెట్టారు. గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు వారిని ప్రశ్నించగా అసభ్య పదజాలంతో దుర్భాషలాడటంతో పాటు పోలీసులపై దాడి చేశారు. అప్రమత్తమైన పోలీసులు స్టేషన్‌కు సమాచారం అందించగా వెంటనే పెట్రోలింగ్ మొబైల్‌తో పోలీసులు వెళ్లి ఆ ఐదుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

మాడ్గులపల్లి, జూలై 16 : నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామశివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. ఎస్‌ఐ శోభన్‌బాబు, బాధితుల కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం త్రిపురారం గుంటిపల్లి అన్నారం గ్రామానికి చెందిన మల్లికంటి శ్రీను(50) వేములపల్లి మండల కేంద్రంలోని సమీప బంధువు మృతిచెందడంతో ఈ నెల 11న అక్కడికి వెళ్లాడు. తిరిగి తన టీవీఎస్‌పై వేములపల్లికి చెందిన మల్లికంటి రాములు(47)ను తీసుకుని వస్తుండగా మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామ శివారులోకి రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. రోడ్డుపక్కనపడడంతో గమనించిన స్థానికులు వెంటనే అంబులెన్స్ సహాయంతో మిర్యాలగూడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నల్లగొండ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాలనడంతో బంధువులు హైద్రాబాద్‌లోని నిమ్స్, యశోద ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ ఈ నెల 14న మృతిచెందినట్లు వారు తెలిపారు. శ్రీను భార్య పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

చండూరు, జూలై 16 : నల్లగొండ జిల్లా చండూరు మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శి సైదులును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతంలో చండూరు పంచాయతీగా ఉన్నప్పుడు కార్యదర్శిగా పనిచేశారు. అయితే కొంతమందికి ఇటీవల కాలంలో పాత తేదీలతో తప్పుడు యాజమాన్య ధ్రువీకరణ పత్రాలను జారీచేశారు. ఈ విషయంపై చండూరు జర్నలిస్టులతో పాటు రైతు సేవా సహకారం సంఘం డైరెక్టర్ కట్ట బిక్షం ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. డీఎల్‌పీవోను విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. నివేదికలో అవినీతి ఆరోపణలు రుజువుకావడంతో వాటి ఆధారంగా కార్యదర్శిని సస్పెండ్‌చేశారు. రూ.కోట్ల విలువ చేసే ప్లాట్లను వెంటనే ప్రభుత్వం, అధికారులు స్వాధీనం చేసుకుని ప్రజాప్రయోజనాలకు ఉపయోగించాలని, అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా అక్రమ రిజిస్ట్రేషన్ల బాగోతంపై ఉన్నతాధికారులు విచారణ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జనగాం రోడ్డుపై గుంతలో నిలిచిన లారీ

భానుపురి, జూలై 16 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జనగాం క్రాస్‌రోడ్డు గుంతల్లో లారీ చక్రాలు చిక్కుకుని నిలిచిపోయింది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జనగాంక్రాస్‌రోడ్డు, జాతీయ రహదారిని కలిపే మూలమలుపులో పెద్దగుంత ఏర్పడింది. ఈ గుంతలో నీరు నిలిచి మరింత పెద్దదిగా మారింది. మంగళవారం రాత్రి రాయచూర్ నుంచి తమిళనాడుకు బయలుదేరిన మొక్కజొన్న పిండి బస్తాల లోడు లారీ చక్రాలో గుంతలో దిగబడ్డాయి. లారీని బయటికి తీయడానికి డ్రైవర్లు గంటపాటు కష్టపడ్డారు. అధికారులు దృష్టిసారించి గుంతను పూడ్చాలని ప్రయాణికులు కోరారు.



జనగాంక్రాస్‌రోడ్డులో గుంతలో దిగబడిన లోడు లారీ

పేరుకుపోయిన నిల్వలు.. నేతన్నకు గుబులు

'చేనేతకు చేయూతనిస్తాం.. పూర్వ వైభవం తెస్తాం.. కార్మికులకు అండగా ఉంటాం.. నూలుపై సబ్సిడీ ఇస్తాం.. రుణమాఫీ చేస్తాం, చేనేతకు చేయూతనిస్తాం.. నేతన్న బీమా అమలు చేస్తాం' ఇవీ పాలకుల ప్రకటనలు. ఈ హామీలు ఆచరణలో ఎక్కడా అమలు కావడం లేదని నేతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విక్రయాలు లేక చేనేత సహకార సంఘాల్లో వస్త్ర నిల్వలు పేరుకుపోతుండడంతో తెలంగాణలోని అతిపెద్ద చేనేత కేంద్రం పోచంపల్లి చేనేత పరిశ్రమ కుంటుపడుతోంది. ఖండాంతర ఖ్యాతి గాంచిన వస్త్రాలు నేతన్నలకు ఉపాధి కల్పించలేక పోతోంది.

- భూదాన్‌పోచంపల్లి





చేనేతకు చెదలు 1

- ఉమ్మడి జిల్లాలో రూ.30 కోట్లకుపైగా గోదాముల్లో సరుకు
- పని లేక కూలీలుగా మారుతున్న చేనేత కార్మికులు
- కొత్త ప్రభుత్వం 'భరోసా' కల్పించేనా?
- మొక్కుబడిగానే టెస్కో ద్వారా చేనేత వస్త్రాలు కొనుగోళ్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా చేనేత సహకార సంఘాల్లో వస్త్ర నిల్వలు పేరుకుపోయాయి. సహకార సంఘాలకు ఎన్నికలు లేక ఏళ్లు గడుస్తున్నాయి. పాలకమండలి లేకపోవడంతో కార్మికులకు ఉపాధి కల్పించలేని స్థితి నెలకొంది. టెస్కో ద్వారా ప్రభుత్వం చేనేత వస్త్రాలు కొనుగోళ్లు మొక్కుబడిగానే చేశాయి. అటు సహకార, ఇటు సహకారేతర రంగాలోని చేనేత కార్మికులకు నేరుగా యారన్ సబ్సిడీ అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రైవేట్ మాస్టర్ వీవర్స్ సైతం ఉత్పత్తులు నిల్వ ఉండడంతో వ్యాపారాలు లేకపోవడంతో వారు కూడా మగ్గాలు నేయించే పరిస్థితిలో లేరు. కార్మికులకు గిట్టుబాటు కల్పించలేక చేతులెత్తేసే స్థితి నెలకొంది. మార్కెట్లో చేనేత వస్త్ర ఉత్పత్తులు పేరుకుపోవడంతో విక్రయాలు లేక మాస్టర్ వీవర్స్ కార్మికులకు పని కల్పించలేక మగ్గాలు మూతపెట్టే పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ సర్కారు నూతనంగా 'నేతన్న భరోసా' పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తే కార్మికుల కష్టాలు తీరే వీలుంది. ఈ మేరకు సంక్షోభంలోని చేనేత రంగాన్ని ఆదుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

వస్త్ర నిల్వలు పేరుకు పోవడానికి కారణాలు

గతంలో ఆప్కో ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి మూడు నెలలకోసారి కొనుగోళ్లు జరిగేవి. కేవలం సహకార సంఘాల్లోనే ప్రొక్యూర్‌మెంట్ ఇచ్చేవారు. దీంతో సంఘాలు ఆర్డర్‌పై కార్మికులతో వస్త్రాలు నేయించేవారు. క్యాష్ క్రెడిట్‌పై సంఘాలు బ్యాంకుల్లో రుణాలు తీసుకుని కార్మికులకు పని కల్పిస్తూ వస్త్ర ఉత్పత్తులను ఆప్కోకు అమ్మేది. వారు ప్రతి ఆరు నెలలకోసారి కొనుగోలు చేసిన వస్త్రాలకు డబ్బులు చెల్లించే వారు. ఆర్డర్ ఇచ్చి మళ్లీ ప్రొక్యూర్‌మెంట్ కల్పించేది. దీంతో సహకార సంఘాలు కార్మికులకు చేతి నిండా పని ఉండేది. పదేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం టెస్కోను ఏర్పాటు చేసింది. ప్రొక్యూర్‌మెంట్ ఇచ్చి సంఘాలకు ఆర్డర్ ఇచ్చినట్లు నామమాత్రంగా వ్యవహరించేది. దీంతో చేనేత సహకార సంఘాలన్నీ పని కల్పించలేని స్థితికి చేరుకున్నాయి. ఇందుకు ప్రధాన కారణం చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించక పోవడం. సంఘాల నిర్వహణపై పర్సన్ ఇన్‌చార్జిలను అప్పగించ డంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. కొన్ని సంఘాల్లోనైతే వస్త్ర నిల్వల్లోని వందలాది చీరలు మాయమయ్యాయి. అజమాయిషీ లేకపోవడంతో అవినీతికి పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. సంఘాల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై 51జీవో పేరుతో విచారణ చేశారు. విచారణలో జాప్యం జరుగుతుండడంతో మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నిక సమయంలో అప్పటి ప్రభుత్వం రద్దు చేసింది. ఆ తర్వాత చేనేత సంఘాల్లో వస్త్రాల కొనుగోళ్లు టెస్కో చేపట్టకపోవడంతో వస్త్ర నిల్వలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి.

గోదాముల్లో మూలుగుతున్న సరుకు

తయారు చేసిన సరుకు గోదాముల్లోనే మూలుగుతోంది. చేనేత పరిశ్రమకు ప్రభుత్వం తగినంత రాయితీలు ఇవ్వకపోవడం, బహిరంగ మార్కెట్లోనూ ఉత్పత్తులకు గిరాకీ లేకపోవడంతో ఇప్పటికే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు చేనేత సహకార సంఘా ల్లో, వస్త్రాలు ఉత్పత్తి చేసే మాస్టర్ వీవర్స్ చేనేత ఉత్పత్తి దారుల వద్ద మొత్తం సుమారు రూ.30 కోట్లకుపైగా సరుకు గోదాముల్లో ఉంది. యాదాద్రిభువనగిరి జిల్లాలోనే రూ.10 కోట్లకు పైగా నిల్వలు ఉన్నాయి. అదేవిధంగా భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని చేనేత సహకార సంఘంలోనే రూ.కోటిన్నర విలువైన సరుకు ప్రస్తుతం గోదాములో ఉంది. గోదాము ల్లో ఉన్న సరుకే అమ్ముడు పోకపోవడంతో చేనేత సహకార సంఘాలు చేనేత కార్మికులకు ఉపాధి కల్పించలేకపోతున్నాయి. దీంతో వారు ఆర్థికంగా చితికిపోతున్నారు. బహిరంగ మార్కెట్‌లోనూ పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాలకు మంచి బ్రాండ్ ఇమేజ్ ఉంది. గతంలో ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ చేనేత కేంద్రాలైన భూదాన్ పోచంపల్లి, కొయ్యలగూడెం, పుట్టపాక, సంస్థాన్‌నారాయణపురం, గట్టుప్పల్, ఎల్లంకి, సిరిపురం, భువనగిరి, రఘునాథపురం, గౌరెల్లి ప్రాంతాల్లోని చేనేత మగ్గాలు కార్మికుల కడుపులు నింపే వి. పదేళ్లుగా కార్మికుల జీవితాలు తలకిందుల య్యాయి. బహిరంగ మార్కెట్లో చేనేత ఉత్పత్తులకు మునుపటి డిమాండ్ లేకపోవడం, సరుకు నిల్వలు రూ.కోట్లలో సంఘాల్లోనే నిల్వ ఉండిపోవడంతో మగ్గాలు మూలన పడ్డాయి. దీంతో చేనే త కార్మికులు గతంలో మాదిరిగా రోజువారీ కూలీలుగా మారుతున్నారు. తెలంగాణ రాష్ట్ర చేనేత కార్మికుల సహకార సంఘం(టెస్కో) వీరికి అండగా నిలవాల్సిన పరిస్థితుల్లో పట్టించుకోవడం లేదన్న వాదన వినిపిస్తోంది. పవర్ లూం పరిశ్రమకు రాయితీలు కల్పిస్తూ వారి జీవనోపాధికి తోడ్పాటు అందిస్తున్న సర్కారు హ్యాండ్లూమ్ కార్మికులకు రావాల్సిన రాయితీలు గత ప్రభుత్వం ఇవ్వలేదని నేతన్నల్లో ఆవేదన వ్యక్తమవుతోంది.



సంక్షోభం నుంచి గట్టెక్కించాలి



చేనేత రంగం తీవ్ర సంక్షోభంలోఉంది. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులకు ప్రకటించిన పథకాలు అమలు చేయడంలో తీవ్ర జాప్యం జరిగింది. ప్రకటనలకే పరిమితం కావడంతో కార్మికులు లబ్ధి పొందలేకపోయారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం నేడు చేనేత రంగానికి శాపంగా మారింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గట్టెక్కించాలని కోరుతున్నాం. సహకార రంగంలోనూ కాకుండా సహకారేతర రంగంలోని చేనేత కార్మికులందరికీ ప్రభుత్వం పథకాలు అమలు చేసి కార్మికులకు అండగా నిలివాలి.

- మెరుగు శశికళ, పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షురాలు, భూదాన్‌పోచంపల్లి

చేనేత రంగం పరిరక్షణకు ప్రభుత్వం కృషి



తెలంగాణలోని గత ప్రభుత్వం టెస్కోకు చెల్లించాల్సిన బకాయిలు నేడు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేందుకు కృషి చేస్తోంది. సంక్షోభంలో ఉన్న చేనేత పరిశ్రమను సంక్షేమం దిశగా పయనించేలా నూతనంగా ప్రభుత్వం 'నేతన్న భరోసా' అమలు చేయనున్నట్లు ప్రకటించారు. త్వరలో ఈ విధానం ద్వారా చేనేతకు మంచి రోజులు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లాలోని చేనేత సహకార సంఘాలకు చెల్లించాల్సిన బకాయిలు రూ. 5 కోట్ల మేరకు మంజూరైనాయి. చేనేత సంఘాలకు ఆర్థిక పరిపుష్టి కల్పిస్తే నూనతనోత్తేజంతో సంఘాలు ముందుకు సాగుతాయని భావిస్తున్నాం. ప్రస్తుతం అన్ని సంఘాల్లో వస్త్రాలు పేరుకుపోయాయి. అయితే దశల వారీగా ప్రభుత్వం వాటిని కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు చేపడుతోంది. కార్మికుల సంక్షేమం కోసం వినూత్న పథకాలకు రూపకల్పన చేస్తోంది.

- విద్యాసాగర్,చేనేత,జౌళి శాఖ ఏడీ, యాదాద్రి జిల్లా.

నూలు రాయితీ అంతేసంగతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని చేనేత కార్మికులను ఆదుకునే ఉద్దేశంతో ఏడేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం పనిచేస్తున్న మగ్గాలకు జియో ట్యాగింగ్ చేయాలని నిర్ణయించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 7,917 మగ్గాలకు అధికారులు జియో ట్యాగింగ్ చేశారు. ఈ మగ్గాలకు అనుబంధంగా 15,934 మంది కార్మికులు పనిచేస్తున్నారు. మరో 20వేల మంది కార్మికులు దీనిపై ఆధారపడి పనిచేస్తున్నా గత ప్రభుత్వం మగ్గాలను గుర్తించి వదిలేసింది. గతంలో కార్మికులు కొనుగోలు చేసే నూలుపై 60 నుంచి 65 శాతం వరకు ప్రభుత్వం నూలు రాయితీ ఇచ్చేది. ప్రస్తుతం వీరికి నూలుపై రాయితీ నిలిపివేసింది. అనేక పోరాటాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం యారన్ సబ్సిడీపై 10 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించాయే తప్ప ఆచరణలో అమలు చేయలేదు. దీంతో సంఘాలన్నీ దివాళా తీశాయి. గత ప్రభుత్వంలో చేనేత శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ అనేక పథకాలు ప్రకటించారు తప్ప ఆచరణలో విఫలమయ్యారు. చేనేత సహకార సంఘాలు టెస్కో డిజైన్లతోనే వస్త్రాలు కార్మికులతో మగ్గాలపై తయారు చేయించి వారికి ఉపాధి కల్పించాల్సిన సంఘాలు నేడు నిస్తేజంగా ఉన్నాయి. సమస్యలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించేందుకు పలు చేనేత సంఘాల నేతలు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రాలు అందజేశారు. చేనేత రంగానికి జవజీవాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేయాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ఇటీవల కలిసి కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కూడా చేనేత సమస్యలను ఆయన విన్నవించారు.

ఇద్దరు బియ్యం వ్యాపారులు అరెస్ట్

కోదాడ రూరల్, జూలై 16: గ్రామాల్లో రేషన్‌కార్డు లబ్ధిదారులు, డీలర్ల వద్ద నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి ఆంధ్రా ప్రాంతంలో విక్రయిస్తున్న ఇద్దరిని సూర్యాపేట జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 7వ తేదీన కాపుగల్లు గ్రామశివారులో టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోటార్ సైకిల్‌పై క్వింటా బియ్యాన్ని తరలిస్తున్న బాణోతు సాంబశివరావును పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు ఆంధ్రాలోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం లింగాల గ్రామంలో బియ్యం దందా నిర్వహిస్తున్న పసుపులేటి నరసింహారావుకు తాను బియ్యం విక్రయిస్తానని సాంబశివరావు చెప్పడంతో పోలీసులు నరసింహారావు ఇంటిపై దాడి చేసి 640బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అప్పుడు నరసింహారావు పరారయ్యాడు. మంగళవారం కోదాడ మండలంలోని చిమిర్యాల క్రాస్‌రోడ్డు వద్ద తిరుగుతుండగా పట్టుకొని కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు. ఇతనితో పాటు బియ్యం వ్యాపారం నిర్వహిస్తున్న కోదాడ మండలంలోని కూచిపుడి గ్రామానికి చెందిన కావేటి కోటేశ్వరరావును కూడా అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళా కండక్టర్‌పై యువతి ఫిర్యాదు

నల్లగొండ, జూలై 16: మహిళా బస్సు కండక్టర్ తనపై చేయి చేసుకుందని ఆరోపిస్తూ ఓ యువతి ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆర్టీసీ అధికారులు సదరు మహిళా కండక్టర్‌ను నార్కట్‌పల్లి డిపో స్పేర్‌లో పెట్టి విచారణ చేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని పహిల్వాన్‌పూర్ గ్రామానికి చెందిన పచిమట్ల ఉదయభాను ఈ నెల 14వ తేదీన భువనగిరి నుంచి వలిగొండ వరకు బస్సు ఎక్కేందుకు భువనగిరి బస్టాండ్‌కు చేరుకుంది. అక్కడ భువనగిరి నుంచి నల్లగొండకు వచ్చే బస్సు పార్కింగ్‌లో ఉండడంతో బస్సులో ఎక్కడానికి వచ్చిన ఉదయభాను కండక్టర్ కలిసి ప్లాట్‌ఫాంపై బస్సును పెట్టవచ్చు కదా అని కండక్టర్‌ను అడిగింది. ఈ సమయంలో ఇద్దరి మధ్య మాటమాట పెరిగింది. కండక్టర్ సుజాత తనపై చేయి చేసుకొందని ఉదయభాను ఆరోపించింది. ఉదయభానుపై తాను చేయి చేసుకోలేదని కండక్టర్ వివరణ ఇచ్చింది. ఉదయభాను తన తండ్రికి ఫోన్ చేసి కండక్టర్ తనను కొట్టిందని చెప్పడంతో టేకులసోమారం వద్ద బస్సు దిగాలని కూతురికి సూచించాడు. దీంతో టేకులసోమారం దగ్గర బస్సు ఆగిన సమయంలో కూతురిని ఎందుకు కొట్టారంటూ ఉదయభాను తండ్రి కండక్టర్‌ను అడిగాడు. ఇదే సమయంలో కొంత మంది ఈ ఘర్షణను వీడియోలో తీయడంతో ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కండక్టర్ తనపై చేయి చేసుకొందని ఆరోపిస్తూ నల్లగొండ ఆర్టీసీ ఆర్ఎం రాజశేఖర్‌కు ఉదయభాను లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఈ విషయాన్ని ఆర్ఎం వివరణను కోరగా కండక్టర్ సుజాతను నార్కట్‌పల్లి డిపో స్పేర్‌లో ఉంచి విచారణ కొనసాగిస్తున్నామని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



నరేందర్(ఫైల్)

నిడమనూరు, జూలై 16: నల్లగొండ జిల్లా నిడమనూరు మండల పరిధిలోని మార్లగడ్డతండా గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. నిడమనూరు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం మార్లగడ్డ తండా గ్రామానికి చెందిన సభావత్ నరేందర్(28) త్రిపురారం మండలం డొంకతండా గ్రామానికి చెందిన ధనావత్ నందిని అనే యువతితో మూడు నెలల క్రితం వివాహం జరిగింది. దంపతులు రెండు నెలలుగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. కానీ భార్యాభర్తల మధ్య తగాదాలు రావడంతో నెల రోజుల కితం హైదరాబాద్ నుంచి మార్లగడ్డతండాకు వచ్చి ఇంటి వద్దే ఉంటున్నారు. ఈ క్రమంలో ఈ నెల 13వ తేదీన ఉదయం బయటకు వెళ్లి వస్తానని చెప్పి నరేందర్ ఎటో వెళ్లిపోయాడు. మూడు రోజులుగా ఇంటికి రాకపోడంతో చుట్టుపక్కల వారు, బంధువుల ఇళ్లలో అడిగినా నరేందర్ ఆచూకీ లభించలేదు. భర్త ఆచూకీ లేకపోవడంతో భార్య కూడా తన పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తన తమ్ముడి కుమారుడు కనిపించడం లేదని నరేందర్ పెదనాన్న సభావత్ మంగ్లా నిడమనూరు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. కాగా నరేందర్ చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోయారు.

ఆయకట్టుకు త్వరలో మూసీ నీటి విడుదల

కేతేపల్లి, జూలై 16: ఆయకట్టులో వానాకాలం పంటల సాగుకు మూసీ ప్రాజెక్టు నీటిని విడుదల చేసేందుకు నీటిపారుదల శాఖ అధికారులు సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. మూసీ ఆయకట్టు రైతాంగానికి ఇది తీపి కబురులాంటిదే. ఆయకట్టుకు సాగునీటి విడుదలపై సందిగ్ధం నెలకొన్న నేపథ్యంలో ఇటీవల నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశంను కలిసిన పలువురు కుడికాల్వ ఆయకట్టు రైతులు, రైతు ప్రతినిధులు ఆయకట్టుకు నీటిని విడుదల చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఇదే బృందంలోని సభ్యులు నంద్యాల సోమిరెడ్డి, మందడి వెంకట్రాంరెడ్డి, నంద్యాల సత్యనారాయణరెడ్డి, జూలకంటి వెంకటరెడ్డి నీటిపారుదల శాఖ సూర్యాపేట సర్కిల్ ఎస్ఈ శివధర్మతేజ్‌తో సోమవారం జరిగిన భేటీలో ఆయకట్టుకు సాగునీటి విడుదల చేయాల్సిన అవసరాన్ని ఆయనకు విన్నవించారు. ప్రాజెక్టులో ప్రస్తుత నీటి నిల్వలు, రాబోయే రోజుల్లో వర్షాలు, వరదలు రావడానికి గల అవకాశాలు, 647.45అడుగుల నీటిమట్టంతో గతంలో ఆయకట్టుకు నీటిని విడుదల చేసిన ఉదంతాలు, ఆ తర్వాత వచ్చిన వరదలకు ప్రాజెక్టు పొంగిపొర్లిన సందర్భాలను ఆయనతో చర్చించారు. రైతులు, రైతు ప్రతినిధుల వాదనలతో ఏకీభవించిన ఎస్ఈ మరో పది రోజుల తర్వాత(ఈ నెల 25నాటికి) నీటి విడుదలకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇదే విషయాన్ని మీడియాకు చెబుతామని రైతు ప్రతినిధులు చెప్పగా.. ఆయన వారించి ఒకటి, రెండు రోజుల్లో తానే మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడిస్తానని చెప్పినట్లు సమాచారం. రైతు ప్రతినిధులు ఎస్ఈని కలవడం, నీటి విడుదలపై ఆయన వారికి హామీ ఇవ్వడం బయటకు పొక్కడంతో ఈ నెల 25నుంచి మొదట తడిగా 25రోజుల పాటు ఆయకట్టుకు నీటి విడుదల ఉంటుందని ఆయకట్టు రైతులంతా వరినార్లు పెంచుకోవాలంటూ రెండు రోజులుగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఈ విషయమై స్పష్టత కోసం మంగళవారం మూసీ డీఈ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా నీటి విడుదల కోసం కుడి కాల్వ ఆయకట్టు రైతులు ఎస్ఈని కలిసింది వాస్తవమేనని, పది రోజుల పాటు పరిస్థితులను గమనించి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పినట్లు తమకు సమాచారం ఉందన్నారు.

మూసీకి స్వల్పంగా ఇన్‌ఫ్లో

నెల రోజులుగా మూసీ ప్రాజెక్టుకు పూర్తిగా పడిపోయిన ఇన్‌ఫ్లో మంగళవారం స్వల్పంగా నమోదైంది. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాలతో పాటు మూసీ ఎగువ పరీవాహక ప్రాంతాల్లో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకల ద్వారా మూసీ నదికి చేరుతున్న వరద నీరు నదిలో గల కత్వలను దాటుకుని క్రమంగా దిగువకు వస్తోంది. దీంతో సోమవారం సాయంత్రానికి 59.87క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో మంగళవారం సాయంత్రానికి 416.43నమోదైంది. 645అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం 637.60అడుగులు (2.69టీఎంసీలు)గా ఉంది.



మూసీ ప్రాజెక్టు

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

భువనగిరి అర్బన్, జూలై 16: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లి దళార్చనలు, స్వామికి నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి చెంత ఆంజనేయ స్వామిని వేదమంత్రాలతో పంచామృతాభిషేకం జరిపిన అర్చకులు సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లి దళార్చనలు చేపట్టారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచరాత్రాగమశాస్త్రరీతిలో నిర్వహించారు. పాతగుట్ట ఆలయం, విష్ణుపుష్కరిణి, కొండపైన శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవగామ పద్ధతిలో కొనసాగాయి. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 12,96,532 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.



ఆంజనేయస్వామి ఆలయంలో హారతి ఇస్తున్న అర్చకుడు

రేషన్ బియ్యం పక్కదారి.. డీలర్‌పై కేసు



విచారణ చేస్తున్న డీటీసీఎస్ శ్రీనివాస్‌గౌడ్

డిండి, జూలై 16: రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించిన డీలర్‌పై కేసు నమోదైంది. దేవరకొండ డీటీసీఎస్ శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా డిండి మండలంలోని కె. గౌరారం మూడు నెలలుగా గ్రామంలోని లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయకుండా పక్కదారి పట్టించినట్లు విచారణలో తేలిందని పేర్కొన్నారు. వినియోగదారులకు అందుబాటులో లేకుండా విధులపట్ల డీలర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని, నిల్వ ఉండాల్సిన బియ్యం కంటే 70క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు డీటీసీఎస్ తెలిపారు. గ్రామస్థులు విచారించి డీలర్ రమావత్ లాలుపై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ పాస్ నిల్వలతో సరిపోల్చగా 70 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉన్నట్లు తెలిపారు. పౌరసరఫరాల బియ్యాన్ని దుర్వినియోగం చేసే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వినియోగదారులకు అసౌకర్యం కలుగకుండా సమీపంలోని మరో డీలర్‌కు బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. డీలర్లు బియ్యం కొనుగోలు చేస్తే కేసులు నమోదు చేస్తామని, లబ్ధిదారులు బియ్యం విక్రయిస్తే కార్డులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

కొండమల్లేపల్లి, జూలై 16: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల పరిధిలోని రామునిగుండ్లతండా, గన్యానాయక్‌తండాల్లో ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 600 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. సారా తయారు చేసినా, విక్రయించినా చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ మల్లేష్, వీరబాబు, సిబ్బంది పోకల స్వామి, శ్రీనయ్య, వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణా, నాగరాజు, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

15క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నల్లగొండ క్రైం, జూలై 16: ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని నల్లగొండ టూటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ టూటౌన్ ఎస్ఐ రావుల నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని రవీంద్రనగర్ నుంచి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. నల్లగొండ పట్టణానికి చెందిన కోటేష్, రమావత్ చందును అదుపులోకి తీసుకుని 15క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంతోపాటు ఆటోను స్థానిక శివాజీనగర్ సమీపంలో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. రమావత్ చందుపై గతంలో కూడా రేషన్ బియ్యం విక్రయంపై కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు డ్రైవర్లు మృతి



మోతెలో ఆగి ఉన్న డీసీఎంను ఢీకొన్న మరో డీసీఎం, మృతిచెందిన డ్రైవర్

మోతె, నాగారం, జూలై 16: సూర్యాపేట జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు డ్రైవర్లు మృతిచెందారు. మోతెలో ఆగిఉన్న డీసీఎంను మరో డీసీఎం వెనుక నుంచి ఢీకొట్టడంతో డ్రైవర్ మృతిచెందాడు. నాగారంలో ఆగిఉన్న లారీని పాల వ్యాను ఢీకొనడంతో పాలవ్యాను డ్రైవర్ మృతిచెందాడు. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు సెంట్రింగ్ కర్రల లోడుతో వెళ్తున్న డీసీఎం క్లచ్‌ప్లేట్ ఫెయిల్ కావడంతో సోమవారం మధ్యాహ్నం జాతీయ రోడ్డు వెంట నిలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ నుంచి హైదరాబాద్‌కు నూనె ప్యాకెట్ల లోడుతో ఏపీ 05 టీఎం 3177 నంబర్ గల డీసీఎం మోతె మండలకేంద్రంలోని జాతీయ రహదారిపై రోడ్డు పక్కన సెంట్రింగ్ కర్రలతో నిలిపి ఉన్న వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో నూనె లోడుతో వెళ్తున్న డ్రైవర్ ఏపీ రాష్ట్రం, కిర్లంపూగి జిల్లా, గోనెడ మండలం, ఈస్టు గోదావరికి చెందిన నలంశెట్టి ఏపీరెమ్(32) మృతిచెందాడు. పెట్రోలింగ్ నిర్వహించాల్సిన పోలీసులు రాకపోవడం, రోడ్డు వెంట ఆగి ఉన్న వాహనాలను గుర్తించకపోవడంతో ఈ సంఘటన జరిగింది వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఏపీరెమ్ అవివాహితుడు తమ్ముడు నల్లంశెట్టి మనీషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

ఆగిఉన్న లారీని ఢీకొని..

నాగారం మండలంలోని ఫణిగిరి గ్రామంలో ఆగిఉన్న లారీని వెనుక నుంచి పాల వ్యాను ఢీకొంది. పాల వ్యాను నడుపుతున్న డ్రైవర్ తీవ్రంగా గాయాలై చికిత్స పొందుతూ మృతిచెందాడు. మంగళవారం తెల్లవారుజామున 5.15 సమయంలో నాగారం మండలం ఫణిగిరి సమీపంలోని బిన్ని రైస్ మిల్లు దగ్గర తమిళనాడుకు చెందిన ఆగిఉన్న లారీని సూర్యాపేట నుంచి జనగాం వెళుతున్న పాలవ్యాను వేగంగా ఢీకొని నుజ్జునుజ్జయింది. జాజిరెడ్డిగూడెం మండలంలోని పర్సాయపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ బైరబోయిన సైదులు(43) తలకు, శరీర భాగాలకు తీవ్రంగా గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు నాగారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ, పోలీసు సిబ్బంది 108 వాహనంలో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట కేంద్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సైదులు మృతిచెందాడు. సైదులుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.



నాగారం: నుజ్జునుజ్జయిన పాలవ్యాను, మృతిచెందిన డ్రైవర్ సైదులు

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

సూర్యాపేటక్రైం, పెద్దఅడిశర్లపల్లి, జూలై 16: వేర్వేరు కారణాలతో సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన కొల్లూరి క్రిష్ణయ్య(46) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసై ప్రతిరోజూ మద్యం మత్తులో ఇంటికి వస్తున్నాడు. దీంతో భార్య రమణతో గొడవలు జరిగేవి. కాగా ఈ నెల 15న రాత్రి 11 గంటలకు మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పెట్టుకున్నాడు. భార్యను బలవంతంగా ఇంట్లోకి తోసి ఇంటి తలుపులు పెట్టి ఇంటి బయట వరండాలో అర్ధరాత్రి సమయంలో ఉరి వేసుకున్నాడు. గమనించిన భార్య రమణ కేకలు వేయగా స్థానికులు గమనించి వచ్చి క్రిష్ణయ్యను స్థానికుల సాయంతో జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. క్రిష్ణయ్య తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు.

మద్యం మత్తులో...

నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అక్కంపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన భాషిపాక రాజయ్య(రాజు)(32) ల్యాబ్ అటెండెంట్‌గా దేవరకొండలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో విధులు నిర్వహిస్తున్నాడు. కొద్ది రోజులుగా మద్యానికి అలవాటు పడి తరుచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. సోమవారం రాత్రి కూడా మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. క్షణికావేశంలో ఇంట్లోకి వెళ్లి తలుపులు పెట్టుకున్నాడు. భార్య పక్క ఇంట్లో నిద్రించింది. తెల్లవారుజామున భార్య నాగమణి ఇంటికి వచ్చి తలుపులు తీసి చూడగా అప్పటికే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని రాజయ్య కనిపించడంతో ఆమె కేకలు వేసింది. చుట్టుపక్కల వాళ్లు వచ్చి చూడగా రాజయ్య అప్పటికే మృతిచెందిఉన్నాడు. నాగమణి ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపారు.

చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలి

● 'అమ్మమాట- అంగన్‌వాడీ బాట'లో అధికారులు



కొండమల్లేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్): ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని అనుముల సీడీపీవో సువర్ణ, పలువురు సూపర్‌వైజర్లు, అధికారులు అన్నారు. జిల్లాలోని పలు మండలాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'అమ్మ మాట - అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీలను ఆంగ్లభాషలో చెప్పనున్నట్లు తెలిపారు. పిల్లలను అంగన్‌వాడీకి పంపించడం ద్వారా వారి వయస్సును బట్టి ఆట పాటల ద్వారా విద్యను అందించడంతో పాటు వారికి ఒక పూట భోజనం, గుడ్డు, మురుకులు ఇవ్వనున్నట్లు తెలిపారు. పిల్లలతో పాటు గర్భిణులు, బాలింతలు కూడా అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

● హాలియా పట్టణంలో అనుముల 1 అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో అనుముల సీడీపీవో సువర్ణ, కౌన్సిలర్ టి.ఎల్లమ్మ, సూపర్‌వైజర్ రమాదేవి మాట్లాడారు. పిల్లలను అంగన్‌వాడీకి పంపించడం ద్వారా వారి వయస్సును బట్టి ఆటపాటల ద్వారా విద్యను అందించడంతో పాటు వారికి ఒక పూట భోజనం, గుడ్డు, మురుకులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీచర్ కృష్ణమరాజు, ఆశ సత్యవతి, ఆర్‌పీలు అస్సు రోజా, రాణి, అంగన్‌వాడీ టీచర్ పద్మమ్మ, హెల్పర్ నాగమ్మ, మహిళలు, పిల్లలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు, అక్కెనపల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. చిన్నారులకు ఆట పాటలతో బోధించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బి.ప్రభావతి, పద్మ, అనిత, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

● మునుగోడు మండలంలోని కొరటికల్ గ్రామంలో అంగన్వాడీ టీచర్లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, తల్లిదండ్రులు, గ్రామపంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు, అంగన్వాడీ టీచర్లు యాదమ్మ, అండాలు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల మునిసిపాలిటీలో పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పాలని ప్రచారం నిర్వహించారు. అంగన్‌వాడీలలో పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ దాడి అరుణ, అపర్ణ, బుజ్జమ్మ, జ్యోతి, శోభారాణి, కృష్ణవేణి పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శోభ, జ్యోతి, వెంకటమ్మ, మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

● మర్రిగూడ మండలంలోని ఎరుగండ్లపల్లి గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో డిప్యూటీ తహసీల్దార్ తారక్ రామన్ పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ యశోద, గ్రామపంచాయతీ సెక్రటరీ శ్రవణ్, అంగన్‌వాడీ టీచర్లు రజిత, మమత, సత్తమ్మ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

● చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్ (మాల్)- 2 అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సూపర్‌వైజర్ జ్ఞానేశ్వరి హాజరై మాట్లాడారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆట-పాటలు, బొమ్మలతో బోధించాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ బాదేపల్లి స్వప్న, ఆయా బక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలు సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్, జూలై 16: పేద ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్‌ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని పన్నాలగూడెంలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన నియోజకవర్గంలోని 72 మందికి రూ.22.84 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి చేసేందుకే నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల హామీలను అమలుచేసేందుకు సీఎం కృషి చేస్తున్నారని త్వరలో రైతుబంధు అమలు చేస్తారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు చామల శ్రీనివాస్, పీఏసీఎస్ ఛైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, నకిరేకంటి యేసుపాదం, పన్నాల రాఘవరెడ్డి, చౌగోని శ్రీను పాల్గొన్నారు.

నక్కలగండి పూర్తిచేసి సాగునీరు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా నర్సింహారెడ్డి

దేవరకొండ, జూలై 17: నక్కలగండి ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి కోరారు. మండలంలోని ఎల్లారెడ్డిబావి గ్రామంలో మంగళవారం నిర్వహించిన పార్టీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఎస్‌ఎల్‌బీసీ, డిండి, నక్కలగండి ప్రాజెక్టు పనులు ముందుకు సాగలేదన్నారు. ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందించాలని కోరారు. ప్రజా సమస్యలపై సీపీఐ పోరాడుతుందన్నారు. సమావేశంలో నాయకులు మావిళ్ల వెంకటయ్య, పల్లా రంగారెడ్డి, వలమాల ఆంజనేయులు, భూపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, మొగిలమ్మ, ఇద్దమ్మ, లింగారెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతర పోరాటం

కొండమల్లేపల్లి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాడుతుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. కొండమల్లేపల్లి మండలంలోని చెన్నంనేనిపల్లి, చింతకుంట్ల గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని, ఇళ్లు లేని పేదలకు ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సమావేశాల్లో సీపీఐ మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డి నాయకులు పి.శేఖరాచారి, కళ్లు చరణ్‌రెడ్డి, శ్రీనివాస్, ధర్మయ్య, నాగయ్య, లచ్చిరాం, వెంకటయ్య, మధు, కాశయ్య, లక్ష్మయ్య, ఇద్దయ్య పాల్గొన్నారు.

పేదల అవసరాలు తీర్చడమే లయన్స్ క్లబ్ లక్ష్యం

దేవరకొండ, జూలై 17: సమాజంలోని పేదల అవసరాలు తీర్చడమే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ముందుకెళ్తుందని లయన్స్ క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ గోలి అమరేందర్‌రెడ్డి అన్నారు. దేవరకొండలో మంగళవారం నిర్వహించిన దేవరకొండ లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. పేదవారి అవసరాలను గుర్తించి వారి వద్దకు వెళ్లి సేవ చేసే ఏకైక సంస్థ లయన్స్‌క్లబ్ అన్నారు. లయన్స్ క్లబ్ దేవరకొండ అధ్యక్ష, కార్యదర్శులుగా వస్కుల సత్యనారాయణ, సముద్రాల ప్రభాకర్, చిలుకూరి నిరంజన్, కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో లయన్ తీగల మోహన్‌రావు, కేవీ ప్రసాద్, మోహన్‌రెడ్డి, వనం బిక్షమయ్య, సముద్రాల ధనంజయ్య, గాజుల రాజేష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మాడ్గులపల్లి, జూలై 16: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిస్ట్రిక్ట్ మలేరియా ఆఫీసర్ దుర్గయ్య అన్నారు. మంగళవారం మండలంలోని కన్నెకల్ గ్రామాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. గ్రామంలో ఎక్కువ మంది ప్రజలు జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మందులు అందుబాటులో ఉంచి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. గ్రామంలో వీధుల్లో తిరిగి ఎక్కువ మంది ఇంటి వద్ద నీళ్లు నిల్వ ఉండటం వల్ల దోమలు వ్యాప్తి చెంది రోగాలకు కారణమవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కిరిబాయి, జోసఫ్, ఏఎన్ఎం రోజా, నాగలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జావీద్ మృతి బాధాకరం : కోటిరెడ్డి, నోముల

హాలియా, జూలై 16: తెలంగాణ ఉద్యమకారుడు, పిట్టలగూడెం మైనార్టీ కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు అనుముల మండలం హజారీగూడెం గ్రామానికి చెందిన జావీద్ గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. మంగళవారం వారు జావీద్ మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్, మాజీ ఎంపీపీ సుమతిపురుషోత్తం, కౌన్సిలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వర్ర వెంకటరెడ్డి, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, వడ్డే సతీష్‌రెడ్డి, నాయకులు దోరేపల్లి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, జలీల్, అబ్బిరెడ్డి, అంజాద్‌ఖాన్, షరీఫ్ పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

దామరచర్ల, జూలై 16: రైతు రుణమాఫీలో షరతులు లేకుండా ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి మాలోతు వినోద్ నాయక్ అన్నారు. మండలంలోని నర్సాపురంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు కటాఫ్ డేట్ పెట్టి రేషన్‌కార్డు ఉన్న రైతులకే రుణమాఫీ చేస్తామని చెప్పడం సరైంది కాదన్నారు. రాష్ట్రంలోని రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాపానాయక్, దయానంద్, ఎర్రనాయక్, కోటిరెడ్డి, విజయ్, బాలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మూసీ కుడి కాల్వకు మరమ్మతులు చేయాలి

కేతేపల్లి, జూలై 16: మూసీ ప్రాజెక్టు కుడి ప్రధాన కాల్వ ప్రారంభంలోనే ధ్వంసమైందని, దానిని వెంటనే మరమ్మతులు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులతో కలిసి మంగళవారం ఆయన మూసీ ప్రాజెక్టు తూము వద్ద ధ్వంసమైన కుడి ప్రధాన కాల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వ ప్రారంభంలోనే ధ్వంసమై ఉంటే చివరి ఆయకట్టుకు ఎలా వెళ్తుందని ఆయన ప్రశ్నించారు. కేతేపల్లిలోని 65వ నెంబర్ జాతీయ రహదారి నుంచి మూసీ ప్రాజెక్టు వద్ద ఉన్న బీసీ బాలుర గురుకుల పాఠశాల వరకు రహదారి మరమ్మతులు చేయాలని ఆయన కోరారు. ఆయన వెంట పార్టీ మండల కార్యదర్శి సీహెచ్.మారయ్య, నాయకులు ఎల్.రాజు, సత్యం, రమేష్, సైదులు, సాంబయ్య ఉన్నారు.

నూతన పీఆర్సీని అమలుచేయాలి

● టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు


మునుగోడులో సభ్యత్వ నమోదులో పాల్గొన్న సైదులు

మునుగోడు రూరల్, నార్కట్‌పల్లి, జూలై 16: ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, నూతన పీఆర్సీ వెంటనే అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు, కోశాధికారి నర్రా శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాలోని మునుగోడు, నార్కట్‌పల్లి మండలాల్లో మంగళవారం టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. సమస్య ఏదైనా ఉపాధ్యాయులకు అండగా నిలుస్తున్న ఏకైక సంఘం టీఎస్ యూటీఎఫ్ మాత్రమేనని అన్నారు. యూటీఎఫ్ ప్రవేశపెట్టిన కుటుంబ సంక్షేమం పథకం కింద వివిధ కారణాలతో చనిపోయిన 25మంది ఉపాధ్యాయులకు రూ.6లక్షల చొప్పున రూ.1.50 కోట్లను బీమా సొమ్ముగా ఇప్పించి ఆదుకున్నట్లు తెలిపారు. అప్‌గ్రేడ్ అయిన పండిట్ పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వంపై తెచ్చిన ఒత్తిడి కారణంగానే జరిగాయన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు, పెండింగ్‌లో ఉన్న 5 డీఏలపై కేబినెట్‌లో చర్చించాలని, పాఠశాలల పర్యవేక్షణ పోస్టులైన ఎంఈవో, డీఈవోల ఖాళీలను పదోన్నతులతో భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. మునుగోడు, నార్కట్‌పల్లి మండలాల్లోని పలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులను యూటీఎఫ్ సభ్యులుగా చేర్చుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గేర నర్సింహ, మునుగోడు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెరికి నర్సింహ, సోమగాని సతీష్‌కుమార్, కోశాధికారి బిక్కమల్ల రాములు, సీనియర్ నాయకులు ఉయ్యాల యాదయ్య, సంజీవయ్య, సుధాకర్‌రెడ్డి, భూతరాజు అంజయ్య, అన్నా మేరి, విశాల, బాబురావు, కల్లూరు స్వామి, కొంపెల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకట్‌నారాయణ, ఎస్.భానుప్రకాష్, నర్రా రవీందర్‌రెడ్డి, కసపరాజు వెంకన్న, పురుషోత్తం, ప్రతాప్‌రెడ్డి, నరేష్, నర్సింహ, సురేష్, రమేష్, విజయ్‌పాల్, ధర్మయ్య, రవి, ఏలేందర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శీత్లా పండుగ


అడవిదేవులపల్లి : శీత్లా వేడుకల్లో పాల్గొన్న గిరిజనులు

తిరుమలగిరి(సాగర్), అడవిదేవులపల్లి, జూలై 16: గిరిజనులు భక్తిశ్రద్ధలతో శీత్లా వేడుకలను ఘనంగా నిర్వహించారు. తిరుమలగిరి(సాగర్) మండలంలోని రంగుండ్ల గ్రామంలో, అడవిదేవులపల్లి మండలం బంగారుకుంటతండాలో ఈ వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శీత్లాభవాని విగ్రహాల వద్ద ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా మొక్కులు చెల్లించారు. వర్షాలు సమృద్ధిగా పడి పాడి పంటలు బాగుండాలని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తండావాసులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

● తిరుమలగిరి (సాగర్) మండలంలోని పలు తండాల్లో శీత్లా భవాని పండుగను ఘనంగా నిర్వహించారు. రంగుండ్ల గ్రామంలో సపావత్ ఆంగోతు భగవాన్‌నాయక్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అంతేకాకుండా మండలంలోని డొక్కలబావి తండా, జువ్విచెట్టుతండా, కీచ్యాతండా, గరికనట్‌తండాల్లో కూడా గిరిజనులు ఈ పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో రమావత్ శ్రీను, ఆంగోతు బాలు, కిషన్, పాండు, బాబురావు, కోట్యానాయక్, సర్దార్, సపావత్ కృష్ణ, రాములు, రమేష్, లక్పతి, మోతీలాల్, హరినాయక్ పాల్గొన్నారు.

● అడవిదేవులపల్లి మండలంలోని బంగారుకుంటతండాలో నిర్వహించిన వేడుకల్లో కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీను, మాజీ ఎంపీటీసీ కొర్రకాంతి కృష్ణకాంత్, మాజీ సర్పంచ్ సుజాత, నాయకులు బాలాజీ, గోల, పూల్‌సింగ్, శ్రీను, రవి, బికారి, కోట్య లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

పీఎంపీ, ఆర్ఎంపీల సమస్యల పరిష్కారానికి సీఎం హామీ

● ఆర్ఎంపీల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు హనుమంతరావు

నల్లగొండ, జూలై 16: రాష్ట్రంలో పీఎంపీలు, ఆర్ఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు హనుమంతరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల తాము సీఎం కలిసి గ్రామీణ వైద్యుల క్లినిక్‌లపై ఐఎంఏ, నేషనల్ కౌన్సిల్ సభ్యులు దాడులు నిర్వహిస్తూ వారి ఉపాధిని దెబ్బతీస్తున్న విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సీఎం పీఎంపీలు, ఆర్ఎంపీల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కలెక్టర్ల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని పీఎంపీలు, ఆర్ఎంపీల సమస్యలు పరిష్కరించాలని ఆదేశించడం హర్షనీయమన్నారు. తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్న నేపథ్యంలో బుధవారం రాష్ట్రవ్యాప్తంగా సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు హనుమంతరావు తెలిపారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి జి.నర్సింహారెడ్డి, నాయకులు బ్రహ్మాచారి, కృష్ణారెడ్డి, లింగరాజు, గణేష్, నజీరుద్దీన్, డీఎస్ఎన్ చారి, వెంకటేశ్వర్లు, యాదగిరి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

108,102 సేవలను సద్వినియోగం చేసుకోవాలి

● వాహనాల్లో పరికరాలను పరిశీలించిన జిల్లా మేనేజర్


పరికరాలను పరిశీలిస్తున్న మధు

నాగార్జునసాగర్, జూలై 16: నాగార్జునసాగర్ కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రిలో ఉన్న 108, 102 వాహనాలను జిల్లా మేనేజర్ మధు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వాహనాల్లో పరికరాలు, మందులను, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్దవూర మండలం సాగర్ పరిధిలో గ్రామాలు, తండాల్లో ప్రజలు 108, 102 సేవలు వినియోగించుకోవాలన్నారు. ఈ వాహనాలు ఆపద సమయంలో అపర సంజీవనులు అని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో 108కి కాల్ చేసి ప్రమాదం, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారు సేవలు ఉచితంగా వినియోగించుకోవాలని కోరారు. ఆయన వెంట 108 సిబ్బంది ఉన్నారు.

బీసీ కాలనీకి దారిని పునరుద్ధరించాలి


ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజలు

మిర్యాలగూడ, జూలై 16: మండల పరిధిలోని జేత్యాతండా బీసీ కాలనీకి దారి చూపాలని ఎంసీపీఐ(యు)రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య, మాజీ ఉప సర్పంచ్ చిర్ర మల్లేష్ డిమాండ్ చేశారు. కాలనీ ప్రజలతో కలిసి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేయడంతో పాటు దారికి అడ్డంగా నిర్మించిన ఫొటోలను అధికారులకు చూపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జేత్యాతండాలోని బీసీ కాలనీలో 45 కుటుంబాల వారు నివసిస్తున్నారని అన్నారు. 2018లో దొండవారిగూడెం నుంచి విభజించి జేత్యాతండాను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేశారని అన్నారు. ప్రస్తుతం తండా నుంచి బీసీ కాలనీకి వెళ్లే దారిని పక్షం రోజుల నుంచి ముళ్ల కంచెలు వేస్తూ కొందరు బాటలో నడవకుండా అడ్డుకుంటున్నారని కాలనీవాసులు ఆరోపించారు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు ఏకంగా బాటకు అడ్డంగా గోడ నిర్మించారని అన్నారు. 35 ఏళ్లుగా కాలనీ ప్రజలు నడుస్తున్న బాటను మూసివేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. ప్రస్తుతం పొలాలు సాగు చేయకపోవడంతో పొలాల నుంచి నడుచుకుంటూ పిల్లలు స్కూల్‌కు వెళ్తున్నారని వాపోయారు. నాట్లు పెడితే కాలనీ దాటి బయటకు రాలేని స్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే బీసీ కాలనీకి దారిని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ కాలనీ ప్రజలు కటికర్ల శ్రీను, దొండ నాగయ్య, హరి, నారాయణ, ఎలకాని శ్రీను, నర్సయ్య, దేవయ్య, గోవిందమ్మ, రేణుక, నాగలక్ష్మి, ఎంసీపీఐ నాయకులు కాశీ, వస్కుల సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు వెంకట్ కుటుంబానికి ఆర్థిక సాయం


వెంకట్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గుత్తా అమిత్

నల్లగొండ, చిట్యాలరూరల్, జూలై 16: చిట్యాల మండలం నేరడ గ్రామానికి చెందిన జర్నలిస్టు కప్పల వెంకట్ కుటుంబానికి గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మృతుని చిత్రపటానికి అమిత్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకట్ గతంలో తనకు వ్యక్తిగత సహాయకుడిగా పనిచేశాడని అన్నారు. ఆయనకు చిన్న పిల్లలు ఉండటంతో వారి చదువుల కోసం ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా వారి కుటుంబానికి అండగా ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కృష్ణ

తిరుమలగిరి(సాగర్), జూలై 16: ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన పసువులేటి కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికలో పసువులేటి కృష్ణకు సంబంధించిన ప్యానల్‌కు వ్యతిరేకంగా ఏ ఒక్కరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఆయనతో పాటు ప్యానల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల కమిటీ సభ్యులు ప్రకటించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా, మండల ఫొటోగ్రాఫర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

దేవరకొండ, జూలై 17: దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించాలని, ఆసుపత్రిలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్ పద్ధతిలో డాక్టర్లు, నర్సులు, సిబ్బంది వివరాలు తెలియజేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములునాయక్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, పడకల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బంది పూర్తి వివరాలు తెలియజేయాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల అంజయ్యయాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్, మల్లేష్‌నాయక్, వస్కుల సుధాకర్, రెడ్డి శంకర్, పద్మ, చండీశ్వర్, ఫణి ఉన్నారు.

గంజాయి విక్రయిస్తే కేసులు నమోదు చేస్తాం : సీఐ

చండూరు, జూలై 16: గంజాయి విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని చండూరు సీఐ వెంకటయ్య, ఎస్ఐ సురేష్ హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన గంజాయి విక్రయిస్తున్న పలువురు అనుమానిత యువకులను మంగళవారం చండూరు పోలీసులు స్టేషన్‌కు పిలిచి విచారించారు. ఈ సందర్భంగా వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. గంజాయి విక్రయాలపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గట్టి నిఘా పెట్టామన్నారు. గంజాయి విక్రయం, గంజాయి తాగుతున్నట్లు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

సంక్షిప్త సమాచారం...

మునుగోడు రూరల్: మండలంలోని గంగోరిగూడెంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులుగా సేవలందించి పదోన్నతి, బదిలీపై వెళ్లిన పాఠశాల హెచ్‌ఎం భూతం ముత్యాలు, ఉపాధ్యాయులు బత్తిని భాస్కర్‌గౌడ్‌ను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు.

గట్టుప్పల్: అమరవీరుల ఆశయ సాధన కోసం ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ అన్నారు. మండల పరిధిలోని తేరట్‌పల్లిలో సీపీఎం నాయకుడు బండ యాదయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదయ్య ఆశయ సాధన కోసం కృషి చేయాలని కోరారు.

నల్లగొండకల్చరల్: గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సిద్దార్థ యోగా విద్యాలయం ఆధ్వర్యంలో పట్టణంలోని చిన వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 21వ తేదీన ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఆరోగ్య సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ఛైర్మన్ డాక్టర్ గున్నా రాజేందర్‌రెడ్డి తెలిపారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని బకాల్‌వాడీ ప్రభుత్వ హైస్కూల్‌లో పోలీస్ కళా బృందం సభ్యులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పాఠశాలలో బాల్యవివాహాలు, మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలపై పోలీస్ కళా బృందం సభ్యులు అవగాహన కల్పించారు. షీ టీమ్ అధికారులు విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

మిర్యాలగూడ టౌన్: కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాధినేని శ్రీనివాసరావు అన్నారు. పీఎం విశ్వకర్మయోజన పథకం ద్వారా కులవృత్తిదారులకు ఉచిత శిక్షణనిచ్చి ఆర్థికసాయం చేయడం గొప్ప విషయమన్నారు. హనుమాన్‌పేటలో విశ్వకర్మ యోజన చెక్కులను పట్టణ ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్యాంతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమాదేవి, అభిరాం పాల్గొన్నారు.

చిట్యాల: శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చిట్యాలలో తన బాల్యమిత్రుడు మందడి శేఖర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మునిసిపల్ ఛైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, రాజయ్య, అశోక్ ఉన్నారు.

దేవరకొండ: దేవరకొండ నియోజకవర్గంలో ఎస్సీ రెసిడెన్షియల్, బాలుర గురుకుల, ఇంటర్, డిగ్రీ బాలుర కళాశాలలు మంజూరు చేయాలని దళిత సంఘాల నేతలు ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్‌ను కోరారు. దేవరకొండలో వారిని కలిసి వినతిపత్రం అందజేశారు. రెసిడెన్షియల్ బాలుర గురుకుల, ఇంటర్, డిగ్రీ బాలుర కళాశాలలు మంజూరు చేస్తే దళిత విద్యార్థులకు విద్యా వసతి అందుబాటులో ఉంటుందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో దళిత సంఘాల జిల్లా జేఏసీ అధ్యక్షుడు కంభాలపల్లి వెంకటయ్య, ఆంజనేయులు, వెంకటయ్య, మైసయ్య ఉన్నారు.

అడవిదేవులపల్లి: మండలంలోని మహిళలకు ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు నిత్య పూజా విధానంపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గ్రామ దేవాలయ అర్చక పరిషత్ కూరాకుల రవీందర్‌కుమార్ తెలిపారు. మండలకేంద్రంలోని రామమందిరంలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిత్య పూజా విధానంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నందున మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శాలిగౌరారం: మొహర్రం సందర్భంగా మండలంలోని శాలిగౌరారం ఆకారం, బైరవునిబండ, పెర్కకొండారం, వల్లాల తదితర గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. డప్పుచప్పుళ్లతో నృత్యాలు చేసుకుంటూ మొహర్రం పండుగను ఘనంగా నిర్వహించారు.

నల్లగొండ రూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, అదే విధంగా అధికారులు కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ హెచ్చరించారు.

నల్లగొండ క్రైం, మర్రిగూడ: కుటుంబంలోని ప్రతీ రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలని, షరతులు లేకుండా మాఫీ చేయాలని ఆప్ జిల్లా ప్రధాన కార్యదర్శి యారా శ్రీను, బీఆర్ఎస్ నాయకుడు బచ్చు రామకృష్ణ అన్నారు. సకాలంలో రైతు భరోసా అందించాలని డిమాండ్ చేశారు.

వేములపల్లి: మాడ్గులపల్లి కస్తూర్బా పాఠశాల విద్యార్థినులను వేములపల్లి ఆదర్శ పాఠశాలకు తరలించకుండా వేరొక చోట ప్రత్యేక భవనాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ అన్నారు.

నల్లగొండ క్రైం: ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎన్.ప్రీతంను ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్ ఘనంగా సన్మానించారు. ఆయన కార్యాలయంలో కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

చింతపల్లి: రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం....హైదరాబాద్‌కు చెందిన ఎం.చంద్రశేఖర్‌రావు, వెంకటమ్మ మల్లేష్, అక్రం కారులో దేవరకొండకు వెళ్లి తిరిగి హైదరాబాద్‌కు పయనమయ్యారు. మండలంలోని పోలేపల్లి రాంనగర్ సమీపంలో ప్రమాదవశాత్తు కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బొలేరో వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంతో కారులో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై ఎస్ఐ యాదయ్యని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

విద్యుత్ అక్రమ వాడకంపై కేసులు నమోదు

నాగార్జునసాగర్: కరెంటు అక్రమంగా వినియోగించే విద్యుత్ వినియోగదారులపై కేసులు నమోదు చేస్తామని విద్యుత్‌శాఖ విజిలెన్స్ ఇన్‌చార్జి ఏడీఈ స్వాతి హెచ్చరించారు. నాగార్జునసాగర్ పైలాన్, హిల్ కాలనీల్లో పలు దుకాణాల్లో విద్యుత్ విజిలెన్స్ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లోడు సామర్థ్యం కన్నా ఎక్కువ విద్యుత్ వాడుకుని తక్కువ బిల్లు వచ్చేలా అక్రమ పద్ధతులను ఏర్పాటు చేసుకున్న వినియోగదారులపై కేసులు నమోదు చేస్తున్నామని ఆమె తెలిపారు.